సాక్షి
కుమురం భీం
శనివారం ၊ 25 ၊ జనవరి ၊ 2025





**భక్తజన సంద్రం..!**
కెరమెరి మండలం మహరాజ్‌గూడ సమీపంలోని జంగుబాయి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. 11లో▸



**ముగిసిన శ్రీమద్దేవీ భాగవతం**
ఆసిఫాబాద్: శిర్డీ సాయి మందిరంలో శ్రీమద్దేవీ భాగవతం శుక్రవారం ముగిసింది. బుర్రా భాస్కర శర్మ ప్రవచనాలు ఇచ్చారు. సామూహిక కుంకుమ పూజలు చేశారు.

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
31.0 /17.5
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పగలు ఎండగా ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

## న్యూస్‌రీల్

### జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

**ఆసిఫాబాద్‌రూరల్:** జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ యాదగిరి శుక్రవారం తెలిపారు. ఇటీవల మంచిర్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో గోపాల్, విక్కి ప్రతిభ చాటి, జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 24 నుంచి 28 వరకు మహారాష్ట్రలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పీడీ ప్రసాద్ తెలిపారు.

### జిల్లా కేంద్రంలో నేడు ర్యాలీ

**ఆసిఫాబాద్:** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 7.30 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు ఉంటాయని, విజయవంతం చేయాలని కోరారు.

### దివ్యాంగులకు ప్రత్యేక కోటా కేటాయించాలి

**ఆసిఫాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ప్రత్యేక కోటా కేటాయించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌కు వినతిపత్రం అందించారు. జీవో 13 ప్రకారం దివ్యాంగులకు ఆర్థిక పరిమితి లేకుండా రేషన్ కార్డులు ఇవ్వాలని, ఐదు శాతం ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. ప్రతీ దివ్యాంగుడికి అదనపు ఆహార భద్రత/ఎఎఫ్ఎస్‌సీ కార్డులు ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఇస్లాంబిన్ హసన్, ఖయ్యూం, బన్నమూర్తి, శ్రీనివాస్, రాజేశ్, రవీందర్ ఉన్నారు.

### 'పొగమంచుతో జాగ్రత్త'

**ఆసిఫాబాద్:** శీతాకాలం నేపథ్యంలో పొగమంచు ఉన్న ప్రదేశాల్లో డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. లోభీమ్ హెడ్‌లైట్లు వినియోగించాలని, తక్కువ వేగంతో వెళ్లాలని సూచించారు. ఫాగ్‌లైట్లు వినియోగించడం ఉత్తమమని అన్నారు. వాహనాలను ఓవర్ టేకింగ్‌చేయకుండా, హారన్‌తో ఇతరులను అలర్ట్ చేయాలని సూచించారు. బైక్ రైడర్లు హెల్మెట్ ధరించాలని కోరారు.

### నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ శేషారావు

**చింతలమానెపల్లి(సిర్పూర్):** 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ(ఆపరేషన్) శేషారావు అన్నారు. మండలంలోని రవీంద్రనగర్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి, మండలాలకు కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట ఏడీఈ రాజేశ్వర్‌రావు, ఏఈ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

### పిండిగిర్నీలు అందజేత



పిండిగిర్నీ అందజేస్తున్న శివకుమార్

**కెరమెరి:** బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) అధికారులు శుక్రవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఉత్పత్తిదారుల రైతు సంఘం సభ్యులకు వందశాతం రాయితీపై పిండిగిర్నీలు అందించారు. మండలంలోని సాకడ గ్రామానికి చెందిన కుర్సెంగ రాము, ఝరి గ్రామానికి చెందిన కుమరం న్యానేశ్వర్‌కు ఒక్కొక్కటి రూ.30 వేల ఖరీదు గల పిండిగిర్నీలు అందించారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ శివకుమార్, శాస్త్రవేత్తలు నాగరాజు, తిరుపతి, రైతులు కేంద్రె బాలాజీ, రాంచందర్, పూసం రాము, శంకర్, ఖండేరావు తదితరులు ఉన్నారు.

## ఇంద్రాదేవికి 'మెస్రం' పూజలు



చెట్టుపైనున్న గంగాజలానికి మొక్కుతూ..

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఈ నెల 28న మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. మహాపూజకు అవసరమైన పవిత్ర గంగాజలాన్ని జన్నారం మండలంలోని హస్తిన మడుగు నుంచి తెస్తున్న మెస్రం వంశీయులు శుక్రవారం ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయ వాయిద్యాల మధ్య వచ్చి ఆలయం ఎదుట ఉన్న మర్రి చెట్టుపై గంగాజలాన్ని భద్రపరిచారు. ఇంద్రాదేవికి పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కేస్లాపూర్ గ్రామ పొలిమేరలోగల మర్రి చెట్టు వద్ద బస చేశారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 28న రాత్రి 10.30 గంటలకు నాగోబా ఆలయంలో మహాపూజ చేసి జాతరను ప్రారంభించనున్నట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. కాగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి 22 కితల మెస్రం వంశీయులు ఎడ్ల బండ్లపై ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. కార్యక్రమాల్లో మెస్రం వంశ పెద్దలు మెస్రం కోసు, కోసేరావ్, దాదారావ్, హనుమంత్‌రావ్, తిరుపతి, గణపతి తదితరులున్నారు. - ఇంద్రవెల్లి



మర్రిచెట్టుపై పవిత్ర గంగాజలాన్ని భద్రపరుస్తూ..

## పోరుగడ్డ.. జోడేఘాట్




**కెరమెరి:** గిరిజనుల హక్కులు, జాతి విముక్తి కోసం జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో నిజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన గోండు వీరుడు కుమురంభీం. 2014లో జోడేఘాట్‌లో జరిగిన భీం వర్ధంతికి వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ జోడేఘాట్ పర్యాటక కేంద్రానికి హామీ ఇచ్చి అమలు చేశారు. రూ.25 కోట్లతో మ్యూజియం, వనమూలికల బృందావనం, స్మృతివనం, జల్‌జంగల్‌జమీన్ ఆర్చీలు నిర్మించారు. మ్యూజియంలో గిరిజనుల ఆభరణాలు, ఆయుధాలు, వాజ్యాలు ఉన్నాయి. భీం మాట్లాడుతున్నట్లు, గుస్సాడీలు నృత్యాలు చేస్తున్నట్లు ఉన్న ప్రతిమలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

**ఇలా వెళ్లవచ్చు**
ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే దారిలో హట్టి స్టాప్ వద్ద దిగాలి. అక్కడి నుంచి జోడేఘాట్‌కు 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆదిలాబాద్ నుంచి హట్టి వరకు 100 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నడుస్తుంది. - వివరాలు 10లో▸

# 2,73,031 మంది అర్హులు

- లెక్కతేల్చిన అధికారులు
- 44,411 కొత్త దరఖాస్తులు
- ముగిసిన గ్రామసభలు
- చివరిరోజూ పలుచోట్ల ఆందోళనలు



దహెగాం గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

**ఆసిఫాబాద్:** రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు అర్హులను గుర్తించేందుకు ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న గ్రామసభలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు జిల్లాలో 57 గ్రామసభలు నిర్వహించగా, 44,243 మందిని అర్హులుగా గుర్తించారు. 701 అభ్యంతరాలు రాగా, 10,807 కొత్తవారు పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 385 గ్రామసభలు, వార్డుసభలు నిర్వహించారు. మొత్తం జిల్లావ్యాప్తంగా నాలుగు పథకాలకు 2,73,031 మందిని అర్హులను గుర్తించారు. కాగా జాబితాలో పేర్లు లేవంటూ 44,411 కొత్త దరఖాస్తులు, అధికారులు చదివిన అర్హుల జాబితాపై 2,429 అభ్యంతరాలు వచ్చాయి.

**పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు**
**కౌటాల(సిర్పూర్):** మండలంలోని పార్డీ గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజలిపై గ్రామానికి చెందిన కొందరు శుక్రవారం ఎంపీడీవో కోట ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులకు ముందుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామసభ నిర్వహించారని ఆరోపించారు. కొందరు రాజకీయ నాయకులకు లాభం చేకూరేలా గుట్టుచప్పుడు కాకుండా గ్రామసభ నిర్వహించడం సమంజసం కాదన్నారు. గ్రామసభ రద్దు చేసి గ్రామస్తులందరి సమక్షంలో మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆనంద్‌రావు, భుజంగ్‌రావు, విశ్వనాథ్, సురేశ్, ప్రభాకర్, లక్ష్మణ్, విజయ్‌కుమార్, పత్రు తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు లేవంటూ..**
**దహెగాం:** మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ప్రజలు నిరసన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితా ప్రకటిస్తుండగా.. ఒక్కసారిగా అధికారులతో వాగ్వాదానికి దిగారు. మాకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా.. సంపన్నులు, రాజకీయ నాయకుల పేర్లు చదువుతున్నారంటూ వేదిక వద్దకు దూసుకొచ్చారు. న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఎంపీడీవో సమాధానం చెప్పాలంటూ పట్టుబట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని సభావేదిక వద్దకు వచ్చిన వారిని సముదాయించినా వారు వెనక్కితగ్గలేదు. ప్రస్తుత జాబితా ఫైనల్ కాదని, ఇందులో పేర్లు లేని వారు అర్హులైతే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సర్దిచెప్పారు. జాబితాలో అనర్హులు ఉంటే వారి పేర్లు తొలగిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం మరోసారి పథకాల కోసం దరఖాస్తు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ స్మృతి, ఏఈవో వంశీ, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు పాల్గొన్నారు.

**ఖిరిడి గ్రామసభలో ఆందోళన**
**వాంకిడి(ఆసిఫాబాద్):** మండలంలోని ఖిరిడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ప్రజలు ఆందోళన చేశారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. 108 మంది దరఖాస్తులు ఆన్‌లైన్ చేయకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని మండిపడ్డారు. ఆ దరఖాస్తులను ఆన్‌లైన్ చేశాకే గ్రామసభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు గ్రామసభ బహిష్కరిస్తున్నట్లు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అధికారులు సర్దిచెప్పి గ్రామ సభ కొనసాగించారు.



గోలేటిలో నిరసన తెలుపుతున్న నాయకులు

**గోలేటిలో నాయకుల నిరసన**
**రెబ్బెన(ఆసిఫాబాద్):** మండలంలోని గోలేటిలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో 30 శాతం మంది అనర్హుల పేర్లే ఉన్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్‌కార్డులు అందిస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ సర్వే చేసి అర్హులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్, బీజేపీ, ఏఐటీయూసీ నాయకులు కమ్యూనిటీ భవనం ఎదుట ధర్నా చేశారు. ముందుగా సింగరేణి రోడ్డుపై ధర్నా చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డీపీవో భిక్షపతి నాయకులతో మాట్లాడారు. అనర్హుల పేర్లు ఉంటే తొలగిస్తామని, అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీవో వాసుదేవ్, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, అజ్మీర బాబురావు, ఆసిఫ్, బీజేపీ నాయకులు ఆంజనేయులుగౌడ్, నవీన్‌గౌడ్, ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భవిత మార్చే ఓటరు..!

- నేడు జాతీయ ఓటరు దినోత్సవం
- పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కు



**గుర్తుంచుకోండి..**
మీ పురోగతి, మీ సంక్షేమం, మీ సంతోషం కోసం ఎన్నికల్లో ఓటు వేయడంలో ఎప్పుడూ విఫలం కావొద్దు.
– మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం

| ఉమ్మడి జిల్లా ఓటర్లు 23,28,426 | |
|---|---|
| పురుషులు | మహిళలు |
| 11,37,514 | 11,87,865 |

**మంచిర్యాలడెస్క్/కౌటాల:** ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులను నిర్దేశించేది ఓటరే. అభివృద్ధి వైపు పయనించాలన్నా.. సరైన పాలకులను ఎన్నుకోవాలన్నా ఓటరు చేతిలోనే ఉంది. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రలోభాలకు గురికాకుండా ప్రతీ ఓటరు ఓటు హక్కు వినియోగించుకుంటే దేశ భవిష్యత్‌ను నిర్దేశించే అస్త్రం అవుతుంది. నేడు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

**ఇలా మొదలై..**
ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచేందుకు భారత ఎన్నికల సంఘం 2011 జనవరి 25నుంచి జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తూ వస్తోంది. 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పడిన నేపథ్యంలో అందుకు గుర్తుగా జనవరి 25ను ఎంచుకుంది. ''ఓటు లాంటిది ఇంకొకటి లేదు.. నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను'' అనే నినాదంతో ఈ ఏడాది 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తోంది.

**18 ఏళ్లు నిండాలి..**
18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అప్పుడే ఏ ఎన్నికల్లో అయినా ఓటు వేసే హక్కు పొందవచ్చు. ఎన్నికల్లో పోటీకీ అవకాశం ఉంటుంది. 1989 కంటే ముందు 21 ఏళ్లు నిండిన వారు మాత్రమే ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉండేది. 1988లో రాజ్యాంగ 61వ సవరణ ద్వారా ఓటరు వయస్సు 18 సంవత్సరాలకు తగ్గించారు. దీంతో 1989 మార్చి 28నుంచి ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం 18ఏళ్లు నిండిన వారు ఓటు వేసే అవకాశం లభించింది. https://voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా, ఏటా కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

**మొదటి ఓటరు ఇక్కడే..**
రాష్ట్రంలోనే మొదటి నియోజకవర్గం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్. ఈ నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామంలో ఆత్రం రంభబాయి మొదటి ఓటరుగా ఉన్నారు. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని ఓటరు జాబితా ప్రారంభం అవుతుంది.

**మహిళలే అధికం..**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అన్నింటిలోనూ మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉంది. పురుష ఓటర్లు 11,37,514 మంది ఉండగా.. మహిళలు 11,87,865 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 50,351 మంది ఎక్కువగా ఉన్నారు.

**ప్రతీ ఓటు విలువైనదే..**
ఎన్నికల్లో ఓటే విజేతను నిర్ణయిస్తుంది. భారీ మెజార్టీ సాధించినా.. ఒక్క ఓటు తేడాతో అయినా గెలుపు గెలుపే. రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాలే యాదయ్య 268 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సిర్పూర్ నియోజకవర్గం నుంచి 3,088 ఓట్ల స్వల్ప మెజార్టీతో పాల్వాయి హరీష్‌బాబు గెలుపొందారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | సర్వీసు ఓటర్లు | మొత్తం |
|---|---|---|---|---|---|
| సిర్పూర్ | 1,15,323 | 1,15,811 | 16 | 305 | 2,31,455 |
| ఆసిఫాబాద్ | 1,13,815 | 1,15,813 | 16 | 121 | 2,29,765 |
| చెన్నూర్ | 96,964 | 99,049 | 7 | 141 | 1,96,161 |
| బెల్లంపల్లి | 88,109 | 90,286 | 13 | 178 | 1,78,586 |
| మంచిర్యాల | 1,39,306 | 1,42,421 | 26 | 365 | 2,82,118 |
| ఆదిలాబాద్ | 1,21,050 | 1,26,805 | 6 | 248 | 2,48,109 |
| బోథ్ | 1,03,554 | 1,10,453 | 2 | 579 | 2,14,588 |
| ఖానాపూర్ | 1,11,157 | 1,16,549 | 14 | 431 | 2,28,151 |
| నిర్మల్ | 1,23,088 | 1,37,730 | 21 | 248 | 2,61,087 |
| ముథోల్ | 1,25,148 | 1,32,948 | 17 | 293 | 2,58,406 |

# అర్హులు ఆందోళన చెందవద్దు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**వాంకిడి(ఆసిఫాబాద్):** అర్హులు ఆందోళన చెందవద్దని, నిబంధనల ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వాంకిడి మండలం జైత్‌పూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాపాలన, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కులగణన సర్వే, ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీలను క్రోడీకరించి ఇంటింటి సర్వే అనంతరం జాబితా రూపొందించామని తెలిపారు. అర్హత ఉన్న వారు జాబితాలో పేరు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని, అలాగే జాబితాలో అనర్హుల పేర్లు ఉంటే అభ్యంతరం తెలియజేయాలని సూచించారు. రైతుభరోసా పథకం కింద సాగుకు యోగ్యం కాని భూములను జాబితా నుంచి తొలగించామని వివరించారు. రేషన్ కార్డుల పంపిణీ, వివరాల మార్పుచేర్పుల ప్రక్రియగా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఏపీవో శ్రావణ్‌కుమార్, ఆర్ఐ మాజిత్, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు

**మెరుగైన వైద్యసేవలు అందించాలి**
వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. వార్డులు, ఔషధాల నిల్వలు, రిజిస్టర్లు, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యసిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట డాక్టర్ వినయ్ ఉప్రే ఉన్నారు.

## ఆకట్టుకున్న బొమ్మల కొలువు

**రెబ్బెన(ఆసిఫాబాద్):** బెల్లంపల్లి ఏరియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లో శుక్రవారం నిర్వహించిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు ఉమారాణి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సింగరేణి సీఎండీ సతీమణి శారద బలరాం, డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి సునీత వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లేడీస్ క్లబ్ సభ్యులతో కలిసి వారు ఉత్సాహంగా ఆడిపాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్యాలు, నాటికలు అలరించాయి. పల్లెటూరి వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లుగా ఎద్దుల బండి, పూరిగుడిసెతోపాటు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంగాపూర్ బాలాజీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నమూనా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి పద్మ, సంయుక్త కార్యదర్శి సౌమ్య, కమిటీ సభ్యులు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



బొమ్మల కొలువును పరిశీలిస్తున్న శారద బలరాం, పక్కన సునీత వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు



పల్లెటూరు వాతావరణం తలపించేలా వేసిన గుడిసె సెట్

# సంక్షేమ పథకాల అమలుపై దృష్టి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ఆసిఫాబాద్:** సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని రాజంపేట గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ప్రజాపాలన సేవా కేంద్రాలు, గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సాగుకు యోగ్యమైన భూములకు కచ్చితంగా రైతు భరోసా పథకం వర్తిస్తుందన్నారు. ఉపాధిహామీ పథకంలో 20 రోజులు పనిచేసిన కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామన్నారు. అనంతరం స్థానిక ఉర్దూ పాఠశాలను సందర్శించారు. వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వంటగదిలో సిబ్బంది పరిశుభ్రత పాటించాలని, నిత్యావసర సరుకులు, తాజా కూరగాయలు వినియోగించాలన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

### 'అడ' ప్రాజెక్టు అందాలు


కుమురం భీం ప్రాజెక్టు పరిసరాలు

**ఆసిఫాబాద్‌రూరల్:** కుమురంభీం జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల సమీపంలో అడ (కుమురంభీం) ప్రాజెక్టు ఉంది. పచ్చని అడవి మధ్యలో నిండుకుండను తలపించే ప్రాజెక్టు చూడముచ్చటగా ఉంటుంది. ఇటీవల బోటింగ్‌సైతం ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు వచ్చి బోటింగ్ చేస్తూ సరదాగా గడుపుతారు. ఆసిఫాబాద్ నుంచి బస్సులు, ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి.

### ఆకట్టుకుంటున్న 'గొల్లవాగు'


భీమారంలోని గొల్లవాగు ప్రాజెక్ట్


**భీమారం:** మండల కేంద్రానికి సమీపంలో దట్టమైన అడవిలో నిర్మించిన గొల్లవాగు ప్రాజెక్ట్‌లో ఏడాదిలో 12 నెలలపాటు జలకళ సంతరించుకుంటుంది. ఇటీవల అటవీశాఖ ఏర్పాటు చేసిన బర్డ్‌వాచ్ కార్యక్రమంతో మరింత ప్రాచుర్యం పొందింది. గతంలో ప్రభుత్వ విప్‌గా పనిచేసిన ఎమ్మెల్యే బాల్క సుమన్ బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు.

### రాబందుల స్థావరం..


పాలరాపు గుట్ట

**పెంచికల్‌పేట్:** కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని నందిగామ వద్ద పెద్దవాగు, ప్రాణహిత సంగమ ప్రాంతంలో ఉన్న పాలరాపు గుట్ట వద్ద గల రాబందుల స్థావరం పర్యాటకులను కనువిందు చేస్తోంది. రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు గూళ్లు కూలిపోవడంతో మహారాష్ట్రలోని కమలాపూర్ వలస వెళ్లి ఏటా రాకపోకలు సాగిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉంది.

### పుణ్యక్షేత్రాల 'గూడెం'


గుట్టపైన సత్యదేవుని ఆలయం

**దండేపల్లి:** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం గుట్టలు పుణ్యక్షేత్రాలకు నిలయంగా మారాయి. గుట్టపై వెలసిన శ్రీసత్యనారాయణస్వామి ఆలయం తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచింది. ఆలయ సమీపంలో ఉన్న మరో ఎత్తయిన కొండపై అయ్యప్ప, పంచముఖ ఆంజనేయ స్వామి, గుట్ట కింద షిర్డీ సాయినాథుని ఆలయం ఉన్నాయి. ఒకేచోట నాలుగు ఆలయాలు ఉండడంతో పుణ్యక్షేత్రాలకు నిలయంగా మారింది.

# అడవుల జిల్లా.. అందాలివిగో..!

- పచ్చని అడవులు.. జాలువారే జలపాతాలు
- ఆకర్షిస్తున్న పురాతన ఆలయాలు
- తీర్చిదిద్దితే మరింత శోభ
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

అడవుల జిల్లా ఆదిలాబాద్. ప్రకృతి అందాలకు కొదువ లేదు. ఎన్నిసార్లు చూసినా తనివి తీరని అందాలు. జాలువారే జలపాతాలు.. అభయారణ్యంలో పచ్చదనం.. పక్షుల కిలకిలా రావాలు.. అడవులకు వచ్చే అతిథులు.. ఇలా అనేక అందాలు జిల్లాలో ఉన్నాయి. పురాతన, చారిత్రక ఆలయాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాకు దక్షిణ కశ్మీర్‌గా గుర్తింపు ఉంది. శీతాకాలంలో, వర్షాకాలం ప్రారంభంలో అడవుల అందాలు చూసి తీరాల్సిందే. నేడు జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని కొన్ని పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతపై ప్రత్యేక కథనం..

### ప్రకృతి ఒడిలో 'పొచ్చర'


పొచ్చర జలపాతం వద్ద పర్యాటకులు (ఫైల్)

**బోథ్:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చర జలపాతం అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. బండరాళ్లపై పడుతున్న నీరు, వచ్చే నీటి తుంపర్లు వీక్షకులను ఆనంద పరవశంలో ముంచెత్తుతాయి. జాలువారే జలధారలు పొచ్చెర జలపాతం అందాలను రెట్టింపు చేస్తాయి. పచ్చని చెట్లు, అక్కడక్కడా ఏర్పాటు చేసిన పచ్చిక మైదానాలు, స్వచ్ఛమైన గాలి పొచ్చర జలపాతం సొంతం. వీకెండ్‌ను ఎంజాయ్ చేసేందుకు చాలా మంది ఇక్కడికి వస్తుండడంతో పిక్నిక్ స్పాట్‌గా మారింది.

**జలపాతానికి ఇలా చేరుకోవాలి..**

నిర్మల్ నుండి వచ్చే వారు జాతీయ రహదారి 44పై నేరడిగొండ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఎడమ వైపు బోథ్ ఎక్స్ రోడ్డు ఉంటుంది. ఎడమ వైపు తిరిగి నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే కుడివైపు జలపాతానికి దారి వస్తుంది. అక్కడి నుంచి కిలోమీటర్ దూరంలో జలపాతం చేరుకోవచ్చు.

**ఆదిలాబాద్ నుండి వచ్చే వారు ...**

అదిలాబాద్ నుండి వచ్చే వారు 44వ జాతీయ రహదారిపై ఆదిలాబాద్ నుంచి 45 కిలోమీటర్లు ప్రయాణించి బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద కుడివైపు తిరిగి నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే కుడివైపు జలపాతానికి దారి వస్తుంది. అక్కడి నుంచి కిలో మీటరు దూరంలో జలపాతానికి చేరుకోవచ్చు.

## వన్యప్రాణుల ఆవాసం 'కవ్వాల్'

**జన్నారం:** దట్టమైన అడవులు, పచ్చదనం పంచుకున్న చెట్లు, పక్షుల కిలకిలలు, వన్యప్రాణుల పరుగులు, వాగుల గలగలలు వీటికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన కవ్వాల్ టైగర్‌జోన్ మంచిర్యాల జిల్లా జన్నారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాలతో పాటుగా తెలంగాణలోని పలు జిల్లాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. రాత్రి రిసార్ట్‌లో బస చేసిన పర్యటకులు ఉదయం 6 గంటలకే అడవిలోకి వెళ్లేందుకు వీలుగా సఫారీ ఏర్పాటు చేశారు. అడవిలో సుమారు 15 కిలోమీటర్లు తీసుకెళ్తారు. ఆ సమయంలో చుక్కల దుప్పులు, సాంబర్లు, ఇతర వన్యప్రాణులు కనిపిస్తాయి.

**సఫారీ చార్జీల వివరాలు**

సోమ, మంగళ, బుధ, గురువారాల్లో ఆరుగురికి రూ.3500, శుక్ర, శని, ఆదివారాల్లో రూ.4వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఆరుగురి కన్న ఎక్కువైతే ఒక్కొక్కరికి రూ.500 అదనంగా చెల్లించాలి.


మైసమ్మకుంట వద్ద వెదురు బొంగుల వంతెన


**కాటేజీల వివరాలు**

జన్నారం హరిత రిసార్ట్స్‌లో పర్యాటకుల కోసం కాటేజీలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి గురువారం వరకు నాన్‌ఏసీ గదికి రూ.1,064, ఏసీ గదికి రూ.1,624, డార్మెంటరీకి రూ.1,600, శుక్ర, శని, ఆదివారాల్లో నాన్‌ఏసీ గదికి రూ.1,176, ఏసీ గదికి రూ.1,792, డార్మెంటరీకి రూ.1800 చార్జీ ఉంటుంది. పూర్తి వివరాలకు 9346392358 నంబర్‌లో సంప్రదించవచ్చు.

**ఇలా వెళ్లవచ్చు**

హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మంచిర్యాల నుంచి బస్సు సౌకర్యం, హైదరాబాద్ నుంచి రైలు సౌకర్యం ఉన్నాయి. హైదరబాద్ నుంచి నేరుగా ఆదిలాబాద్‌కు వెళ్లే బస్సు ద్వారా జన్నారం చేరుకోవచ్చు. రైలులో వస్తే మంచిర్యాల నుంచి బస్సులో వెళ్లవచ్చు.

### పాలధారలతో 'గాయత్రి'



**ఇచ్చోడ:** రెండు ఎత్తయిన కొండల మధ్య హోరుమనే శబ్దంతో జాలువారే జలధారలతో గాయత్రి జలపాతం చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని గుండివాగు సమీపంలో ఈ జలపాతం ఉంది. ఇచ్చోడ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

### పాపికొండలను తలపించే మొసళ్ల మడుగు


మొసళ్ల మడుగు

**జైపూర్:** ఎటుచూసినా ఎత్తయిన గుట్టల మధ్య సహజసిద్ధంగా గోదావరినదిలో ఏర్పడిన మొసళ్ల మడుగు పాపికొండలను తలపిస్తోంది. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని శివ్వారం గ్రామ సమీపంలో మొసళ్ల మడుగు ఉంది. పార్వతి బ్యారేజీ–అన్నారం బ్యారేజీ మధ్యలో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో సుమారు 3 కిలోమీటర్ల వెడల్పులో విస్తరించింది. తాటిచెట్టంత లోతులో సుమారు 20 మీటర్ల మేరకు నీళ్లు ఉండే మడుగు అనేక రకాల ఉభయచర జీవులకు ఆవాసంగా మారింది. ఇందులో 30కి పైగా మొసళ్లు, 100కు పైగా నీటి కుక్కలు, నక్షత్ర తాబేళ్లు, స్టార్ ఫిష్‌లతో పాటు నీటి జంతువులు ఉన్నాయి.

### కనువిందు చేస్తున్న 'కుంటాల'


జలపాతం వద్ద పర్యాటకులు (ఫైల్)

**నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం నుండి 12 కిలో మీటర్ల దూరంలో కుంటాల వద్ద జలపాతం ఉంది. రెండు పాయలుగా ఏర్పడి 147 మీటర్ల ఎత్తు నుండి పరవళ్లు తొ క్కుతూ నీళ్లు కిందికి వస్తాయి. పూర్వం శకుంతల, దుశ్యంతులు ప్రణయ విహారయాత్రకు వచ్చి మంత్రముగ్ధులై ఇక్కడే ఉండిపోయారని, దీంతో జలపాతాన్ని శకుంతల జలపాతంగా పిలుస్తుండేవారని ప్రాచీన శాస్త్రం చెబుతోంది. కాల క్రమేణా కుంటాల జలపాతంగా పిలువబడుతోంది. ఆదిలాబాద్ నుంచి 47 కిలోమీటర్లు, నిర్మల్ నుండి 35 కిలోమీటర్ల దూరంలో నేరడిగొండ, అక్కడి నుంచి 12 కిలోమీటర్ల దూరంలో కుంటాల ఉంటుంది.

### ప్రకృతి అందాలకు నెలవు 'కడెం'


బోటులో విహరిస్తున్న పర్యాటకులు

**కడెం:** చుట్టూ సహ్యాద్రి కొండలు, వాటిపై పచ్చని తివాచీ పర్చినట్లు చెట్లు, కొండలను ఆనుకుని ఉన్న కడెం జలాశయం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. నిర్మల్ జిల్లా కడెం మండలంలో ఈ ప్రాజెక్టు ఉంది. ఇందులో ఏర్పాటు చేసిన బోట్లలో విహరిస్తూ పర్యాటకులు సందడి చేస్తుంటారు. పిక్నిక్ స్పాట్‌తో పాటుగా, షూటింగ్ స్పాట్‌గా మంచి ఆదరణ పొందుతోంది.

**ఇలా వెళ్లాలి**

నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారి గుండా కడెం వెళ్లవచ్చు. హైదరాబాద్ నుండి 300, నిర్మల్, జగిత్యాల నుంచి 50, మంచిర్యాల నుంచి 90 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

### గిరిజనుల ఆరాధ్యుడు 'చిన్నయ్య'


గుట్టపైన చిన్నయ్య దేవుని గుడి

**లక్సెట్టిపేట:** మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం చందారం గ్రామ పంచాయతీ పరిధిలోని చల్లంపేట శివారు అటవీప్రాంతంలో సుమారు 150 ఏళ్ల క్రితం కొలువు దీరాడు గిరిజనుల ఆరాధ్య దైవమైన చిన్నయ్య. ప్రాచీన కాలంలో పాండవులు ఇక్కడ వ్యవసాయం చేసేవారని పూర్వీకులు చెబుతుంటారు. రైతులు దుక్కి దున్నేముందు దేవుడి దర్శనం చేసుకుని బండారు(పసుపు) తెచ్చుకుని ధాన్యం వేసేటప్పుడు అందులో కలిపి సాగు చేస్తారు. పంట చేతికి వచ్చిన తర్వాత దినుసును దేవుడికి అప్పజెప్పి మొక్కు చెల్లించుకుంటారు. గుడిలో అల్లుబండకు ప్రత్యేకత ఉంది. భక్తులు మనసులో కోరుకుని అల్లుబండ లేపితే సులభంగా లేచినట్లయితే కోరిక నెరవేరుతుందని, బరువుగా ఉంటే నెరవేరదని నమ్మకం.



### స్వగ్రామం చేరిన మృతదేహం


రమేశ్ (ఫైల్)

**జన్నారం:** ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన కుక్కటికారి రమేశ్ (47) మృతదేహం ఐదు రోజులకు స్వగ్రామం చేరుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుక్కటికారి రమేశ్ గతేడాది ఉపాధి నిమిత్తం బెహరన్ వెళ్లాడు. ఈ నెల 20న పనికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. శుక్రవారం సాయంత్రం మృతదేహం ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య చంద్రిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**కైలాస్‌నగర్(జైనథ్):** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై పురుషోతం తెలిపారు. మండలంలోని లక్ష్మీంపూర్‌కు చెందిన కుష్నపెల్లి మహేష్ (23) బైక్‌పై ఇంటికి వెళ్తుండగా చెట్టును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

### లారీ ఢీకొని మహిళ..

**మందమర్రిరూరల్:** పట్టణంలోని యాపల్ ప్రాంతానికి చెందిన పిల్లలమర్రి లలిత (58) లారీ ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. సదరు మహిళ పాత బస్టాండ్ ఏరియాలో కూరగాయలు తీసుకుని ఇంటికి వెళ్తుండగా మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### బైక్ పైనుంచి కిందపడి మహిళ..


రజిత (ఫైల్)

**జన్నారం:** బైక్ పైనుంచి కిందపడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన టేకుమల్ల రజిత (35)కు లక్సెట్టిపేట మండలంలోని ఎల్లారంకు చెందిన సత్తయ్యతో వివాహమైంది. సత్తయ్య సోదరి భర్త ఇటీవల బెహరాన్‌లో మృతి చెందగా శుక్రవారం మృతదేహం స్వగ్రామం తిమ్మాపూర్ చేరుకుంది. అంత్యక్రియలకు హాజరైన రజితకు బీపీ తక్కువ కావడంతో ఆమె తండ్రి లింగన్న తాళ్లపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తుండగా బైక్‌కు కుక్క అడ్డురావడంతో కిందపడిపోయారు. మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త సత్తయ్య ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు.

### గడ్డిమందు తాగి ఒకరు ఆత్మహత్య


చంద్రకాంత్(ఫైల్)

**నార్నూర్:** పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాన్కాపూర్‌కు చెందిన మహాత్మ చంద్రకాంత్ (21) వ్యవసాయంతో పాటు మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో గడ్డి మందు తాగడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. మృతునికి భార్య ప్రియాంక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేసి పూర్తి వివరాలు తెలియజేస్తామని సీఐ రహీం పాషా తెలిపారు.

### చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**తాండూర్:** చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. చాకేపల్లి గ్రామానికి చెందిన జక్కుల మొండి (50) గురువారం చేపలు పట్టేందుకు అచ్చులాపూర్ గ్రామ శివారులో ఉన్న పెద్దమడుగుకు వెళ్లాడు. వల వేస్తుండగా ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులకు చుట్టుకోవడంతో మృతి చెందాడు. మృతుని తల్లి వెంకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

**వేమనపల్లి:** మండల కేంద్రంలో శుక్రవారం పిచ్చికుక్క నలుగురిపై దాడిచేయడంతో గాయాలయ్యాయి. జాలరివాడకు చెందిన కంపెల మల్లక్క, తొర్రెం వెంకటి, గాండ్ల వెంకటి, రాజారాం గ్రామానికి చెందిన మరో మహిళపై వేమనపల్లికి చెందిన ఓ గేదెపై దాడికి పాల్పడింది. గ్రామస్తులు కర్రలతో కొట్టి చంపారు. క్షతగాత్రులను 108లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### మోసగించిన ఉపాధ్యాయుడు అరెస్ట్

**జన్నారం:** స్కీంలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని ఆశ చూపి మోసగించిన ఉపాధ్యాయుడు జాడి మురళిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. తన్విత ఆయుర్వేదిక్ స్కీంలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేశాడని జన్నారం మండలం పొనకల్‌కు చెందిన మామిడి నర్సయ్య ఫిర్యాదు చేయగా నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## అమ్మవార్లకు పోచంపల్లి చీరెలు


మగ్గం నేస్తున్న కమిటీ సభ్యులు

**బాసర:** బాసరలోని జ్ఞాన సరస్వతి, మహాలక్ష్మి అమ్మవార్లకు వసంత పంచమిని పురస్కరించుకుని ఏటా అఖిలభారత భక్త మార్కండేయ ఆశ్రమం తరపున పోచంపల్లి మగ్గంతో తయారు చేయించి ఇస్తామని అఖిల భారత భక్త మార్కండేయ కమిటీ అధ్యక్షుడు రాపోలు సుధాకర్ తెలిపారు. శుక్రవారం నాటి ప్రారంభ కార్యక్రమంలో సత్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు గుజ్జ రాజేశ్వరి, ఉపాధ్యక్షులు పున్న రమణ, విశ్వం, కోమటి సత్యనారాయణ, ఎనుగంటి రాజమౌళి, కొక్కుల గంగాధర్ పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

**బాసర:** బాసర ఆర్జీయూకేటీలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వేగవంతమైన ప్రపంచంలో డిజిటల్ అక్షరాస్యత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు విజయం సాధించడానికి సాధ్యమైనంత వనరులను అందించడమే మా లక్ష్యం అన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఏవో రణధీర్ సాగి, అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, నెట్ వర్కింగ్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి రంజిత్ పాల్గొన్నారు.

## చనిపోయిన వారి పేరుమీద రుణాలు!

- రూ.6కోట్లకు పైగా స్వాహా
- ఆలస్యంగా వెలుగులోకి..

**మంచిర్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో ఉన్న ఓ ప్రముఖ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న మేనేజర్ అధికమొత్తంలో డబ్బు సంపాదించాలని అత్యాశకు పోయాడు. అందులో పనిచేసే సిబ్బందితో కలిసి పథకం వేశాడు. కొంతమంది చనిపోయిన వారి పేరుమీద ఆధార్‌కార్డులు తయారు చేయించారు. వ్యక్తిగత, హౌసింగ్ లోన్ పేరిట సుమారు రూ.6 కోట్లకు పైగా రుణం తీసుకున్నాడు. కిస్తీలు కట్టకపోవడంతో ఫైనాన్స్ అధికారులు దృష్టి సారించడంతో బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పది రోజుల క్రితం మేనేజర్‌తో పాటు మరో ఇద్దరిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

### అడవిపందులు తరలిస్తున్న ముఠా అరెస్ట్

**భైంసాటౌన్:** అడవి పందులను అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భైంసా ఎఫ్ఆర్వో వేణుగోపాల్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి దాడులు చేసి దేగాంకు చెందిన కోనేరు పోశెట్టి, కోనేరు గజేందర్, కోనేరు ఈశ్వర్, భైంసాకు చెందిన చెర్ల మహేశ్, చెర్ల గణేశ్, రాసూర్ గోవింద్, ఈరేవార్ సోను, మహా రాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం కోర్టులో హాజరు పర్చినట్లు వెల్లడించారు.